

పంతంగి టోల్‌గేట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు తదితరులు

ట్రాఫిక్ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోండి

● పంతంగి టోల్‌ప్లాజా, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్, మల్కాపురంచెరువు, పంతంగి టోల్‌గేట్‌లను సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. వర్షాల కారణంగా ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తీసుకోవలసిన నష్టనివారణ చర్యలు, జాగ్రత్తల గురిం చి అధికారులకు వివరించారు. టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, స్టేషన్‌లోని రికార్డులను, రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్, సీసీ టీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్



ప్రభుత్వ బీసీ హాస్టల్ వంట గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ జానకి

హయత్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు హయత్‌నగర్ తహసీల్దార్ జానకి సోమవారం కల్వంచలోని బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల మెనును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. వంట గదిని, హాస్టల్ పరిసరాలను, వాష్ ఏరియాను, బాత్రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. నాణ్యమైన సరుకులను వాడుతున్నారా అని వార్డెన్ రాజేంద్రప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. శుభ్రతను పాటించాలని వంట మనుషులను కోరారు. ఎప్పటికప్పుడు చేతులు కడుకుని విద్యార్థులకు వంట చేసి పెట్టాలని కోరారు. విద్యార్థులకు అందిస్తున్న వంట కాల గురించి కూడా అడిగారు. వారానికి రెండు సార్లు గుడ్లు, అరటి పండ్లు, చికెన్ అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహయాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతుకు విరాళం

● రూ.80వేలు అందజేసిన కార్పొరేటర్లు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల సీసీ కెమెరాలు కొంత కాలంగా పని చేయకపోవడంతో నేర సంఘటనలు చోటు చేసుకున్న సందర్భాల్లో ఫుటేజీలు లభించని పరిస్థితి నెలకొంది. దాంతో సదరు కెమెరాల మరమ్మతు నిమిత్తం స్థానిక బీజేపీ కార్పొరేటర్లు విరాళం అందజేయడానికి ముందుకొచ్చారు. ఈ క్రమంలో మరమ్మతుల కోసం అవసరమైన రూ.80వేలు చెక్కు రూపంలో సోమవారం ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డికి అందజేశారు. సీసీ కెమెరాలను తొందరగా రిపేర్ చేయించాలని ఈ సందర్భంగా వారు ఆయనను కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, బీజేపీ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం కాపాడాలని కమిషనర్‌కు వినతి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 18వ డివిజన్ పరిధిలో గల విజయపురి కాలనీలో సర్వే నంబర్.75/1 లోని దాదాపు 2,200 చదరపు గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అధికారులు స్పందించి దానిని కాపాడాలని స్థానికులు సోమవారం బడంగ్‌పేట్ కమిషనర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని సదరు ఖాళీ స్థలానికి బైనంబర్లు వేసి, పది తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొందరు ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఈ కబ్జా పర్వం నడుస్తున్నదని వారు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి సదరు పార్కు స్థలాన్ని కాపాడాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తిమ్మని గిరీశ్, బొర్ర రవిమాదిగ, నీరుడి శ్రీరాములు, ఉమేశ్, సుధాకర్ ఉన్నారు.

వర్షాకాలంలో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య



వరదనీటి సమస్యను పరిష్కరిస్తున్న ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీ యాదయ్య

వనస్థలిపురం, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ -3 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. మూడు రోజులుగా వరుసగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వఉండే ప్రాంతాలైన ఎల్బీనగర్‌లోని సితార హోటల్ దగ్గర, చింతలకుంటలోని రెయిన్‌బో ఆస్పత్రి వద్ద, నాగోల్‌చెరువు నుంచి మూసీలో కలిసే మార్గంలో వర్షపునీరు నిల్వకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను సోమవారం డీసీ యాదయ్య అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ సర్కిల్-3లో వరదనీటితో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వరదనీటికి అడ్డుగా ఉన్న చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఈఈ రమేష్‌బాబు, ఏఈ రాకేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో సోమవారం కార్పొరేటర్ పర్యటించి వర్షాలకు కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా మాన్‌సూన్ టీమ్‌తో నాలాల్లో పేరుకపోయిన చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కేఎల్ఎన్ రావు, జవాన్ యాదయ్య, శానిటేషన్ సూపర్‌వైజర్ మధు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు రోడ్డు మరమ్మతులు చేయించాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

చాదర్‌ఘాట్ : రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మలకోపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లన్నింటికి తక్షణమే మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులతో కూడిన బృందం సోమవారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉత్సవ సమితి సభ్యులు బొక్క మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కౌడి మహేందర్, మధుకర్‌రెడ్డి, నిరంజన్‌యాదవ్, సహదేవ్‌యాదవ్, సుభాష్‌చందర్, ఉదయ్, బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, ముఖేష్‌తో కూడిన బృందం జెడ్సీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జెడ్సీ వెంకన్న మాట్లాడుతూ ఇప్పటికే గణేశ్ ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు జీహెచ్ఎంసీ చేపట్టడం ప్రారంభించిందని తెలిపారు. ఎలాంటి సమస్యలు పరిష్కారం కాకపోయినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైఎస్‌ఆర్‌కు కాంగ్రెస్ నేతల ఘన నివాళి



అల్మాస్‌గూడలో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు



మంద మల్లమ్మ చౌరస్తాలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు



చిత్రాలేఅవుట్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలో కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్క్ వద్ద యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కామినేని చౌరస్తాలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు

మంద మల్లమ్మ చౌరస్తాలో..

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ మంద మల్లమ్మ చౌరస్తాలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి సామిడి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సామిడి సాయి చరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నక్క బాలకృష్ణ, దరావత్ స్వామినాయక్, అరుణ, యాదగిరిరావు, రవీందర్, కిషోర్, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్మన్‌ఘాట్‌లో..

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తోకటి కిరణ్, బద్రీనాథ్, వెంకట్‌రెడ్డి, సాయి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కామినేని చౌరస్తాలో..

వనస్థలిపురం: కామినేని చౌరస్తాలోని వైఎస్ఆర్ విగ్రహానికి టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు డీసీసీ కార్యదర్శి ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, కొలన్ సుధాకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, పృధ్వీరాజ్, నర్సింహారావు పాల్గొన్నారు.



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి తదితరులు

చిత్రాలేఅవుట్‌లో..

ఎల్బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం పరిధిలోని చిత్రా లేఅవుట్‌లోని వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తలాటి రమేష్‌నేత, పెద్దవూర సైదులు, రాజునాయక్, భాస్కర్, ప్రేమ్‌నాయక్, జహంగీర్, నానునాయక్, పెరిక అశోక్, విప్లవ పాల్గొన్నారు.

చావునీ, ఆజంపుర వార్డు కార్యాలయాల పరిశీలన



ఆజంపుర వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల, పక్కన సూపరింటెండెంట్ డాక్టర్ దీన్‌దయాళ్ తదితరులు

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): డబీర్‌పుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగా చావునీ వార్డు కార్యాలయానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా డబీర్‌పురలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆజంపుర వార్డు కార్యాలయంలోకి తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం చావునీ, ఆజంపుర వార్డు కార్యాలయాలను పరిశీలించారు. ఎమ్మెల్యే బలాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ దీన్ దయాళ్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జగదీష్, ఏఈ నాయక్‌తో కలిసి పరిశీలించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆజంపుర వార్డు కార్యాలయంలోకి..

డబీర్‌పురలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆజంపుర వార్డు కార్యాలయంలోకి తరలించేందుకు అవసరమైన అనుమతుల కోసం ఎమ్మెల్యే బలాల జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో వీటి ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన జెడ్సీకి సూచించారు. ఎమ్మెల్యే బలాల వెంట చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, ఎంఐఎం నాయకుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



వికలాంగుల హాస్టల్‌ను సందర్శిస్తున్న చైర్మన్ ముత్తినేని వీరయ్య

వికలాంగుల హాస్టళ్లలో సమస్యలు లేకుండా చూడాలి

ఓల్డ్ మలక్‌పేట, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వికలాంగుల సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సరూర్‌నగర్‌లోని అంధ బాలికల హాస్టల్, చంపాపేటలోని శారీరక వికలాంగుల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరూర్‌నగర్ అంధ బాలికల హాస్టల్ పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ చేయాలని స్థానిక ఏసీపీకి ఫోన్‌చేసి తెలిపారు. విద్యార్థులకు నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సంబంధిత వార్డెన్‌లకు సూచించారు. హాస్టళ్లలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని విద్యార్థులతో అన్నారు. ప్రతి నెల హాస్టళ్లను సందర్శిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

వరదనీటి కాల్వ ద్వారా నీటిని కిందకు పంపుతాం

● నేషనల్ హైవే ఎస్ఈ ధర్మారెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపైన నిలుస్తున్న వర్షం నీరు వల్ల కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు జాతీయ రహదారి విస్తరణ ఎస్ఈ ధర్మారెడ్డి సోమవారం హయత్‌నగర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ వద్ద జాతీయ రహదారిపైన నిలుస్తున్న నీరును పరిశీలించారు. హైకోర్టుకాలనీ, ఆటోనగర్ మీదుగా వచ్చే వర్షం నీరంత పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ వద్ద నిలిచి చెరువును తలపిస్తుందని కార్పొరేటర్ ఎస్ఈకి వివరించారు. దీంతో జాతీయ రహదారిపైన గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతుందన్నారు. నీరు నిల్వకుండా తగిన పైపులైన్ ద్వారా కిందకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అందుకు స్పందించిన ఎస్ఈ వరద నీటి కాల్వ ద్వారా నీరు కిందకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ వద్ద జాతీయ రహదారిపై నిలుస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న నేషనల్ హైవే ఎస్ఈ ధర్మారెడ్డి



బాతుల చెరువు, కుమ్మకుంట చెరువులను పరిశీలించిన తహసీల్దార్ జానకి

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

కొత్తపేట, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ పరిధిలో ఉండే శ్రీకాంత్(20) ఓ బాలిక(17)కు మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానంటూ దగ్గరయ్యాడు. అతడు దిల్‌సుఖ్‌నగర్‌లోని బియ్యం విక్రయ దుకాణంలో పనిచేస్తున్నా డు. ఈనెల 1వ తేదీన అతడు సదరు బాలికను తన రూమ్‌కు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎక్కడికి వెళ్లిందో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈలోగా ఆ బాలిక ఇంటికి రావడంతో ఎక్కడికి వెళ్లావంటూ గట్టిగా అడిగారు. శ్రీకాంత్ తనను రూమ్‌కు తీసుకువెళ్లి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక వారితో చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించారు.

వృద్ధుడి అదృశ్యం



పరవస్తు కృష్ణ(ఫైల్)

కొత్తపేట, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన వృద్ధుడు ఇంటికి తిరిగిరాని సంఘటన నాగోల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరవస్తు కృష్ణ(75) అనే వృద్ధుడు నాగోల్ జైపురికాలనీ రాజ్యలక్ష్మికాలనీలో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతడికి పక్షవాతం రావడంతో అతడు సరిగా మాట్లాడలేడు. ఆగస్టు 30వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు అతడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం బంధువులను, స్నేహితులను సంప్రదించినా ఫలితం దక్కలేదు. సోమవారం సాయంత్రం అతడి కుమారుడు పరవస్తు భానుప్రకాష్ నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఎన్ఐఐఎంహెచ్‌లో జాతీయ సెమినార్

సైదాబాద్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్ఐఐఎంహెచ్)లో మంగళ, బుధవారాలలో సంప్రదాయ వైద్యంలో ఔషధ అభివృద్ధిపై జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ సెమినార్‌ను ఉదయం 9గంటలకు సీసీఆర్ఏఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వైద్య రబీ నారాయణ ఆచార్య ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథులుగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌డీ హెల్త్‌కేర్ కోల్‌కత్తా సలహాదారు డాక్టర్ చంద్రకాంత్ కటియార్ హాజరు కానున్నారు. ఈ సెమినార్‌లో ఆయూష్ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణులు, 50మంది పరిశోధన అధికారులు, 100కు పైగా శాస్త్రవేత్తలు ఆన్‌లైన్‌లో పాల్గొననున్నారు.

అమావాస్య అన్నదానం

చంపాపేట: పేదలకు అన్నదానం చేయడం మహాదానం అని హస్తినాపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీలా మధుసూదన్‌గుప్తా అన్నారు. డివిజన్‌లోని ఓంకార్‌నగర్ బస్టాప్ వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 600 మందికి అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు పేదలకు అన్నదానం చేస్తున్నట్లు, ఆకలితో ఉన్న పేదలను ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బిజ్జాల వేణుగుప్తా, కోశాధికారి బండారు సుధాకర్‌గుప్తా, సభ్యులు రవీందర్‌గుప్తా, కె.గణేశ్‌గుప్తా, ఎన్.భాస్కర్‌గుప్తా, ఎం.రాజు, సీహెచ్.గణేశ్, ఎస్.మధు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం



అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఇనాంగూడ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. చౌటుప్పల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. నేషనల్ హైవే విస్తరణ పనులు జరుగుతున్న తరుణంలో ఎటువెళ్లాలో తెలియక తికమకపడిన కారు డ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది.

వినాయక మండపం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

● స్థానికులపై మద్యం మత్తులో యువకుల దాడి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వినాయక మండపం ఏర్పాటు చేసుకునే విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. చివరకు ఇది పోలీస్‌స్టేషన్ దాకా వెళ్లింది. బడంగ్‌పేట్ కార్పొరేషన్ 30వ డివిజన్‌లోని ఎంసీఆర్‌కాలనీకి చెందిన ఓ వీధి నివాసితులు తమ వీధిలో వినాయకుడిని ప్రతిష్ఠించుకునేందుకుగాను ఆదివారం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే అదే కాలనీకి చెందిన కొందరు యువకులు వచ్చి అందరం కలిసి ఒకే చోట వినాయకుడిని పెట్టుకుని పూజలు చేసుకుందామని, గల్లీకో వినాయకుడు అవసరం లేదని పేర్కొన్నారు. కాగా తమ వీధిలోని పిల్లలు ముచ్చటపడుతున్నారని, వారి కోసం కేవలం ఐదు రోజుల పూజలు నిర్వహించి, అనంతరం అందరం అక్కడికే వస్తామని వాళ్లు చెప్పడంతో సరే అని వెళ్లిపోయారు. అయితే రాత్రి అయ్యాక దాదాపు 50 మందికి పైగా యువకులు మద్యం మత్తులో సదరు వీధిలోకి వచ్చి, ఇక్కడ వినాయకుడిని ప్రతిష్ఠిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ నానా రభస సృష్టించారు. స్థానికులు ఏర్పాటు చేసుకుంటున్న మండపాన్ని కూల్చేసి స్థానికులను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. దాంతో బాధితులు డయల్ 100కు ఫోన్‌చేయగా పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

అనంతరం బాధితులు మీర్‌పేట్ పీఎస్‌కు వెళ్లి తమపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక రాజకీయ నాయకుల అండతోనే తమపై దాడికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

వినాయక చవితి, నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు

● ఉప కమిషనర్లు సుజాత, సేవా ఇస్లావత్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులు, నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్లు సుజాత, సేవా ఇస్లావత్ తెలిపారు. సోమవారం సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయాలలో స్థానిక కార్పొరేటర్లతో పాటు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన రహదారులలో మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చెట్లకొమ్మలు తగలకుండా ట్రిమ్మింగ్ చేయించి వాటిని వెంటనే తొలగించాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. వినాయక మండపాల వద్ద, వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులు, బేబీ పాండ్‌ల వద్ద ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని శానిటేషన్ అధికారులను వారు ఆదేశించారు. ప్రతి వినాయక మండపం పరిసరాలలో యాంటీ లార్వల్ ఆపరేషన్, ఫాగింగ్ కార్యక్రమాలను చేపట్టాలని వారు ఎంటమాలజీ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఊరేగింపు రూట్‌లో భక్తుల దాహార్తి తీర్చడానికి మంచినీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని వారు జలమండలి అధికారులకు సూచించారు. నవరాత్రి ఉత్సవాలు, నిమజన ఊరేగింపు సమయాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, ట్రాఫిక్ విభాగం అధికారులకు వారు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, నర్సింహగుప్తా, దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్, ఉత్సవ సమితి ప్రతినిధులు సిల్వేరి అనీల్‌కుమార్, సుధాకర్, ఆకుల అఖిల్, శేఖర్, రాములుగౌడ్, కిరణ్, శ్రవణ్, ఈఈ శ్రీనివాస్, కార్తీక్, ఏసీపీ ప్రతాప్, డీఈ చందన, ఏఎంహెచ్ నగేష్‌నాయక్, హార్టికల్చర్ మేనేజర్ సత్యనారాయణ, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



కార్పొరేటర్లు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశంలో ఎల్బీనగర్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్



కార్పొరేటర్లు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమావేశంలో సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాత